సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 5 । మే । 2023



జల్సాలకు అలవాటు పడి చోరీలు

జల్సాలకు అలవాటు పడిన ఐదుగురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి బంగారు నగలు, మోటార్‌బైక్‌లు చోరీ చేస్తున్నారు. వారిని పోలీసులు అరెస్ట్ చేశారు.

8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,430
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,696
3 శాతం జీఎస్టీతో	రూ.5,867
నవర (8 గ్రా)	రూ.46,936

గరిష్ఠం/కనిష్ఠం
32.5 /27.6

వాతావరణం

జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయి. గురువారం గాలిలో 67 శాతం తేమ ఉంది. శుక్రవారం ఆకాశం మేఘావృతమై జల్లులు పడే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది.

న్యూస్‌రీల్

98.06 శాతం పెన్షన్ల పంపిణీ



మాతమ్మకు నగదు అందజేస్తున్న సచివాలయ సెక్రటరీ అశోక్ కుమార్

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా గురువారం వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు నగదు అందజేశారు. దీంతో 98.06 శాతంగా నమోదైంది. నగదు పంపిణీ శుక్రవారంతో ముగుస్తుంది.

పంట నష్టం వివరాలు సేకరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు నెల్లూరులోని కలెక్టరేట్ నుంచి జేసీ రోణంకి కూర్మనాథ్, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగ వరప్రసాద్ తదితరులు హాజరయ్యారు. పంట నష్టం, భూముల రీ సర్వే, ఇళ్ల నిర్మాణాలపై సీఎస్ సమీక్ష చేసి, వివిధ అంశాలపై దిశా నిర్దేశం చేశారు.

సోమశిలలో 50.093 టీఎంసీలు



చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 50.093 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 188 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. కాగా పెన్నార్ డెల్టాకు 2,750 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 350, దక్షిణ కాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో నీటి మట్టం 96.326 మీటర్లు ఉంది.

నేడు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక

నెల్లూరు(టౌన్): రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన శుక్రవారం రాత్రి దుత్తలూరుకు చేరుకుని బస చేస్తారు. శనివారం దుత్తలూరు, ఆత్మకూరు, కందుకూరు తదితర ప్రాంతాల్లోని వివిధ పాఠశాలలను ఆయన పరిశీలిస్తారు. అవే కాకుండా మరికొన్ని ప్రాంతాల్లోని పాఠశాలలను తనిఖీ చేసే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. మనబడి నాడు – నేడు పనులు, జగనన్న విద్యాకానుక తదితర వాటి గురించి ఆరా తీస్తారు.

కల్యాణమస్తు, షాదీ తోఫా నగదు జమ నేడు

నెల్లూరు(పొగతోట): వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలకు సంబంధించి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో శుక్రవారం నగదు జమ చేయనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారుల కోసం రూ.2,91,50,000 నగదు కేటాయించారు. నగదు జమ చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

నలుగురు హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(టౌన్): మనబడి నాడు – నేడు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తూ పాఠశాలకు రాకుండా ఉన్న నలుగురు ప్రధానోపాధ్యాయులకు డీఈఓ గంగా భవాని గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నాడు–నేడు పనులు జరుగుతున్నా ఆ పాఠశాలల హెచ్‌ఎంలు విధులకు గైర్హాజరవుతున్నారని ఏపీడబ్ల్యూఐడీసీ ఈఈ జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేశారు. కొడవలూరు మండలం దర్గాలోని ఎంపీపీఎస్, గండవరం గిరిజన కాలనీలోని ఎంపీపీఎస్, పార్లపల్లిలోని జెడ్పీహెచ్ఎస్, వావిళ్లలోని ఎంపీపీఎస్ హెడ్‌మాస్టర్లకు నోటీసులిచ్చి మూడు రోజుల్లోగా వివరణ పంపాలని ఆదేశించారు.

స్త్రీనిధి వెలుగులు

- ఒక్కో గ్రూపునకు రూ.4.50 లక్షల రుణం
- పైసా ఖర్చు లేకుండా మంజూరు
- జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజు నిల్
- గత ప్రభుత్వంలో ఐదుగురు సభ్యులకు రూ.లక్ష మాత్రమే



మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంది. వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అనేక పథకాలను అమలు చేస్తోంది. పొదుపు సంఘంలో సభ్యులైన మహిళలకు స్త్రీనిధి ద్వారా జీవనోపాధుల కోసం రుణాలను అందజేస్తారు. గత ప్రభుత్వ హయాంలో రుణం చాలా తక్కువగా ఉండేది. ప్రస్తుతం ఒక్కో గ్రూపునకు ఇచ్చే మొత్తం రూ.4.50 లక్షలకు చేరింది. దీనిపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో..

2021-22లో అందజేసిన మొత్తం:	రూ. 152 కోట్లు
2022-23లో అందజేసిన మొత్తం:	రూ. 113.19 కోట్లు
2023-24 లక్ష్యం :	రూ. 142 కోట్లు



నెల్లూరు(పొగతోట): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు స్త్రీనిధి రుణాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలను స్త్రీనిధి రుణాలు అత్యవసర సమయాల్లో ఆదుకుంటున్నాయి. కొందరు పిల్లల చదువులు, వివాహాలకు, మరికొందరు జీవనోపాధికి వినియోగించుకుంటున్నారు.

జిల్లాలోని 38 మండలాల్లో 45 వేల స్వయం సహాయక గ్రూపులున్నాయి. వాటిలో సుమారు 5 లక్షలకు మందికిపైగా మహిళలు రుణాలు తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్త్రీనిధి రుణాలు నలుగురు నుంచి ఐదుగురు సభ్యులకు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున మొత్తం కలిపి రూ.లక్ష మంజూరు చేసేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారింది. ఏడు నుంచి తొమ్మిది మంది మహిళలకు రూ.4.50 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నారు. అంతే కాకుండా లబ్ధిదారులు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా పరిపుష్టి సాధించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.



నెల్లూరులోని డీఆర్‌డీఏ కార్యాలయం

నేడు ఇలా..

మహిళల జీవనోపాధులు పెరిగేలా ప్రస్తుతం అతి తక్కువ శాతం వడ్డీపై స్త్రీనిధి రుణాలను సకాలంలో మంజూరు చేస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా బ్యాంకుల చుట్టూ తిరిగే పనిలేకుండా ఇంటి నుంచే రుణాలు పొందే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లో రుణాలు మంజూరు చేస్తున్నారు. ఇందుకోసం ఎవరికీ పైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజు కూడా లేదు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.142 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే రూ.5 కోట్లను లబ్ధిదారులకు అందజేశారు. రుణం తీసుకున్న మహిళ మరణిస్తే భారం ఇతర సభ్యులపై పడకుండా ఆమె చెల్లించాల్సిన మొత్తాన్ని మాఫీ చేస్తున్నారు.

వచ్చిన ఆదాయంలో..

స్వయం సహాయక గ్రూపు మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నారు. రుణాలు తీసుకుని చెల్లించే వడ్డీతో స్త్రీనిధి సంస్థకు లాభాలు వస్తున్నాయి. వచ్చిన లాభాల్లో కొంత భాగాన్ని గ్రామ సంఘాలు (వీఓఏ), మండల సమాఖ్యలకు కేటాయిస్తున్నారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన ఆదాయంలో కొంత భాగం 1,141 వీఓఏలకు రూ.44,06,910, మండల సమాఖ్యలకు రూ.21,70,995 అందజేశారు.

సద్వినియోగం చేసుకోవాలి



స్త్రీనిధి రుణాల కోసం మహిళలు ఇంటి నుంచి దరఖాస్తు చేసుకుంటే 48 గంటల్లో మంజూరు చేస్తాం. జీఎస్టీ, ప్రాసెసింగ్ ఫీజులు చెల్లించాల్సిన పని లేదు. తక్కువ వడ్డీతో రుణాలు అందజేస్తున్నాం. తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నాం.

– కామాక్షయ్య, స్త్రీనిధి ఏజీఎం

ఇప్పటికే రూ.5 కోట్లు ఇచ్చాం



ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.142 కోట్ల స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. ఇప్పటికే రూ.5 కోట్లకు పైగా అందజేశాం. గ్రూపులోని ఏడు నుంచి తొమ్మిది మంది మహిళలకు రూ.4.50 లక్షలు మంజూరు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు చిన్న చిన్న దుకాణాలు, పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకున్నాం. తక్కువ వడ్డీపై రుణాలిస్తున్నాం.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ సీరియస్

- సమగ్రశిక్షలో డెప్యుటేషన్ల రద్దు
- బిల్లుల్లో సంతకాలపై నివేదిక పంపించాలని ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(టౌన్): సమగ్రశిక్షలో డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఏడుగురు ఉద్యోగులను ఎట్టకేలకు రిలీవ్ చేశారు. ఈనెల 3వ తేదీన 'మేం ఇక్కడే ఉంటాం' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసులు స్పందించారు. అధికారులపై సీరియస్ అయ్యారు. విచారించి నివేదిక సమర్పించాలని డీఈఓ గంగాభవానీని ఆదేశించారు. కొన్నేళ్లుగా డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఏడుగురు ఉద్యోగులకు సంబంధించిన వివరాలను తెప్పించుకున్నారు. వారి డెప్యుటేషన్లు రద్దు చేస్తూ మాతృ సంస్థల్లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలిచ్చారు. అదే విధంగా బిల్లుపై ఐఈ కో–ఆర్డినేటర్ సంతకానికి బదులు వేరే వారిది ఉన్న విషయంపై సమగ్రంగా విచారించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. గతంలో జిల్లా సమగ్రశిక్ష ఏపీసీపై కొందరు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అభివృద్ధి కార్యక్రమాలు, బిల్లులు సంబంధిత విషయాలపై సమగ్రంగా విచారిస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

43,270 ఎకరాల చుక్కల భూములకు విముక్తి

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 163తో జిల్లాలో 43,270 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు కలెక్టర్ ఎం.హరినారాయణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల 18 వేల మందికి లబ్ధి చేకూరుతుందన్నారు.

సీఎం చొరవతో హైవే పనులు పూర్తి



జాతీయ రహదారిని పరిశీలిస్తున్న మంత్రి కాకాణి

- టీడీపీకి కాసుల వేట తప్ప ప్రజల సమస్యలు పట్టవు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మనుబోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో మనుబోలు – గూడూరు మధ్య రూ.135 కోట్లతో 16వ నంబర్ జాతీయ రహదారి పునర్నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మనుబోలు మండల పరిధిలో ఆఖరి దశకు చేరుకున్న జాతీయ రహదారి పనులను గురువారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015 సంవత్సరం చివర్లో వచ్చిన వరదలకు ఇక్కడి హైవే కొట్టుకుపోయిందని, అయితే దాని పునర్నిర్మాణ పనుల్లో గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. వివిధ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు రహదారి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేసినా గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం కేంద్రంలో భాగస్వామిగా ఉండి కూడా హైవే నిర్మాణంపై చొరవ చూపకపోవడం దురదృష్టకరమన్నారు. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ఈ ప్రాంతంలో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తేవన్నారు. మళ్లీ వరదలు వస్తే ఉన్న కాస్త రోడ్డు కూడా కొట్టుకుపోతుందని ఈ ప్రాంత ప్రజలు భయపడుతుండే వారని తెలిపారు. టీడీపీ ప్రభుత్వానికి కాసుల వేట తప్ప ప్రజల సమస్యలు పట్టవని విమర్శించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ సమస్యను వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

కేంద్రంతో మాట్లాడి..

2019లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక కేంద్రంతో మాట్లాడి శాశ్వత ప్రాతిపదికన 6 లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారని కాకాణి తెలిపారు. భవిష్యత్‌లో కండలేరుకు ఉధృతంగా వరదలు వచ్చినా ఇబ్బంది లేకుండా రీ డిజైన్‌తో రైల్వే లైన్‌కు దీటుగా వంతెనలు నిర్మించారని తెలిపారు. హైవే నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి, ఇంకా రాష్ట్ర సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ హెచ్ఏఐ పీడీ సందీప్, కన్సల్టెంట్ లీడర్ ప్రకాష్ రావు, డీటీ బాలకోటమ్మ, ఎంపీపీ వజ్రమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్‌రెడ్డి, ఆదినారాయణ, హరగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి, మహేంద్రవర్మ, కిశోర్ నాయుడు, జానకిరామిరెడ్డి, రమేష్, రఫీ, రవి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ ఎంట్రన్స్ టెస్ట్‌కు ఏర్పాట్లు



మాట్లాడుతున్న వెంకటనారాయణమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): ఈనెల 10వ తేదీన పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ ఆదేశించారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో గురువారం ఆమె పరీక్ష కో–ఆర్డినేటర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల్లూరు నగరంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, డీకేడబ్ల్యూ జూనియర్, డిగ్రీ కళాశాలలు, జగన్స్ డిగ్రీ, పీజీ కళాశాలలు, వీఆర్ కాలేజీ, ఎస్ఆర్‌కే ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో, ఆత్మకూరు పట్టణంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, నలంద, ప్రగతి ఉన్నత పాఠశాలలు, కావలి పట్టణంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. నెల్లూరుకు కో–ఆర్డినేటర్‌గా మధుబాబు, కావలికి ఎ.సురేష్, ఆత్మకూరుకు బి.రవీంద్రను నియమించామన్నారు.

సింహ వాహనంపై నృసింహుడి చిద్విలాసం

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం నృసింహ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సింహ వాహనంపై శ్రీవారు యోగ నరసింహస్వామి అలంకరణలో కోన మాడవీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. నెల్లూరు, కడప, చిత్తూరు జిల్లాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. క్రేన్ మండపంలో శ్రీవారు, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మి దేవేరులకు నవకలశ స్నపన తిరుమంజనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

- రాత్రి 7 గంటలకు పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మి దేవేరులకు ఊంజల్‌సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ చెన్నుతిరుపాల్‌రెడ్డి, ఈఓ జనార్దన రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గరుడ గోవిందం

రాత్రి బంగారు గరుడ వాహనంపై లక్ష్మీనరసింహ స్వామి కోన మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. భక్తుల గోవిందనామస్మరణతో పెంచలకోనలోని వెలుగొండలు మార్మోగాయి.

నేడు శ్రీవారి తిరు కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 6 గంటలకు శ్రీవార్లకు పూలంగిసేవ, 9.50కి శ్రీవారి కల్యాణం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, రాత్రి 9 గంటలకు గజ వాహనసేవ, 12 గంటలకు ఏకాంతసేవ జరుగుతుందని ఏసీ వెంకటసుబ్బయ్య తెలిపారు.



సింహ వాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి



కోలాటం ఆడుతున్న మహిళా భక్తులు



బంగారు గరుడ వాహనంపై ఆశీనులైన శ్రీవారు

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో నీటి సరఫరా, డ్రెయినేజీ, చెత్త సేకరణ, వీధిదీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ భవనాన్ని నిర్మిస్తున్నారు. దీని ద్వారా సమస్యలను గుర్తించడం.. వెంటనే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- కార్పొరేషన్‌లో కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణం
- రూ.6.65 కోట్లతో పనులు
- ఇప్పటికే 80 శాతం పూర్తి



నిర్మాణంలో ఉన్న కమాండ్ కంట్రోల్ భవనం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో కమాండ్ కంట్రోల్ భవనాన్ని నిర్మిస్తున్నారు. రూ.6.65 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే సుమారు 80 శాతం పనులు పూర్తయ్యాయి. ఈ భవనంలో 54 కంప్యూటర్లు ఏర్పాటు చేయనున్నారు. వీటికి అనుసంధానంగా హాల్లో ఒక పెద్ద స్క్రీన్ అమరుస్తారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలను గుర్తించిన సంబంధిత సిబ్బంది వెంటనే సెల్‌ఫోన్ ద్వారా వీడియోలు, ఫొటోలు తీసి కమాండ్ కంట్రోల్‌కు పంపిస్తారు. ఆయా సమస్యల ఫొటోలను కంప్యూటర్ ఆపరేటర్లు పెద్ద స్క్రీన్‌పై తిలకించే ఏర్పాట్లు చేస్తారు. ఈ ప్రక్రియ 24/7 జరుగుతూనే ఉంటుంది. సమస్యలను ఆపరేటర్లు సంబంధిత అధికారులకు తెలియజేస్తారు. వారు తగిన చర్యలు తీసుకుంటారు.

వెంటనే స్పందిస్తారు

నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 54 డివిజన్లున్నాయి. ఎక్కడైనా డ్రెయినేజీ లీక్ లేదా నీటి సరఫరా ప్రధాన పైప్ పగిలిపోయి నీరు వృథా కావడం, ఇంకా చెత్త సేకరణ ప్రక్రియలో ఇబ్బందులు, వీధి దీపాలు వెలగకపోవడం తదితర సమసలను గుర్తించి వెంటనే పరిష్కరిస్తారు. సిబ్బంది చేసే పనులను కూడా కమాండ్ కంట్రోల్ భవనం నుంచి అధికారులు తిలకిస్తూ అవసరమైన సూచనలు చేస్తారు. అంతేకాకుండా భారీ వర్షాల సమయంలో నగరంలో ఎక్కడైనా రహదారుల్లో నీరు నిలిచిపోయి ఉన్నా వెంటనే గుర్తించి పనులు చేపట్టే అవకాశం ఉంది.

నిర్మాణం ఇలా..

కమాండ్ కంట్రోల్ భవనాన్ని జీ+3తో నిర్మిస్తున్నారు. 200 మందితో సమావేశం ఏర్పాటు చేసుకునేందుకు ఒక పెద్ద మీటింగ్ హాల్ కట్టారు. ఉన్నతాధికారులు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లకు అధికారులు హాజరయ్యేందుకు ప్రత్యేకంగా మినీ మీటింగ్‌హాల్ ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా కూర్చుని మాట్లాడుకునేందుకు వీఐపీ లాంజ్ నిర్మించారు.

ఎంతో ఉపయోగం



నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడైనా సమస్యలు తలెత్తినప్పుడు వాటిని గుర్తించి వెంటనే పరిష్కరించేందుకు ఈ కమాండ్ కంట్రోల్ ఎంతో ఉపయోగపడుతుంది. అత్యాధునిక టెక్నాలజీతో సమస్యలను గుర్తిస్తారు. సిబ్బంది చేస్తున్న పనులను పర్యవేక్షిస్తూ వారికి తగిన సూచనలు, సలహాలు కూడా అందించే అవకాశం ఉంది. మరో నెల లేదా రెండు నెలల్లోపు పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం.

– సంపత్‌కుమార్, ఎస్ఈ, నెల్లూరు నగరపాలక సంస్థ



కమాండ్ కంట్రోల్ భవనం లోపలి భాగం

విద్యతోనే ఉజ్వల భవిత


మాట్లాడుతున్న ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెట్టి కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నట్లు ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ సభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంపస్ సెలక్షన్స్‌లో కళాశాలకు చెందిన 21 మంది విద్యార్థులు ఎంపికవగా, వారికి నియామక పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే మంచి సంస్థల్లో ఉద్యోగాలు లభించడం అదృష్టమన్నారు. తొలి జీతం మరిచిపోలేని అనుభూతిని కలిగిస్తుందని, ఇలాంటి అనుభూతి తాను కూడా పొందినట్లు గుర్తుచేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పాలిటెక్నిక్ కళాశాలలో 3,500 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కాయన్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదని, ప్రస్తుతం భారతీయుల శక్తి సామర్థ్యాలను అనేక దేశాలు గుర్తించి పెద్ద కంపెనీల్లో అత్యున్నత స్థానాలు కల్పించిన విషయాన్ని వివరించారు. ఎంజీఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే మూడుసార్లు ఉద్యోగ మేళా నిర్వహించినట్లు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, వెంకట రమణారెడ్డి, బి.రాములు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకట రమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు మోయిళ్ల గౌరి, బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి, కంటాబత్తిన రఘునాథరెడ్డి, సయ్యద్ జమీర్ పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

- ఎండులోనూ తీసిపోము

పురుషులతో సమానంగా ఎండులోనూ తీసిపోమంటూ మహిళలు రుజువు చేస్తున్నారు. నెల్లూరు ప్రధాన బస్టాండ్‌లో బస్సుల క్లీనింగ్‌ను మహిళా కార్మికులు చేపడుతున్నారు. కొందరు నీటిని స్ప్రే చేస్తుండగా మరికొందరు సబ్బు నీళ్లతో శుభ్రపరుస్తూ బస్సులను అందంగా తీర్చిదిద్దుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


బ్రెష్‌తో బస్సును కడుగుతున్న మహిళా కార్మికులు


నీటిని స్ప్రే చేస్తూ..

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:129
లేయర్ (లైవ్)	:80
బ్రాయిలర్ చికెన్	:224
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:250
లేయర్ చికెన్	:136

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	:రూ.75
సన్నవి	:రూ.45
పండ్లు	:రూ.25

పట్టుదలతో చదివి ఉత్తీర్ణులు కావాలి

- జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కె.మధుబాబు


విద్యార్థులతో మాట్లాడుతున్న మధుబాబు

వెంకటాచలం : ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తీర్ణులు కావాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి కె.మధుబాబు సూచించారు. వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన ఇంటర్–23 పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ఈనెల 1వ తేదీ నుంచి ప్రత్యేక స్టడీ అవర్స్ జరుగుతున్నాయి. ఇవి ఎలా జరుగుతున్నాయో తెలుసుకునేందుకు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మధుబాబు, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి టి.వరప్రసాద్‌రావు గురువారం కళాశాలకు వచ్చి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు సబ్జెక్టులలో ఫెయిలైనంత మాత్రాన ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పట్టుదలతో చదివి ఉత్తీర్ణులు కావాలని సూచించారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని తెలియజేశారు.

లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నియామకం

నెల్లూరు(లీగల్) : నెల్లూరు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులను లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌కు నియమిస్తూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సీనియర్ న్యాయవాది టంగుటూరు గోపాల్ రెడ్డిని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా, గౌరీసుబ్బమ్మ డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌గా, సూళ్లూరు హర్షవర్ధన్‌ను అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్‌గా నియమించింది. ఇటీవల నిర్వహించిన రాత పరీక్షలు, ఇంటర్వ్యూల అనంతరం మెరిట్ ప్రాతిపదికన వీరి నియామకం జరిగింది. ఈ పదవిలో రెండు సంవత్సరాల పాటు కొనసాగుతారు. వీరి నియామకంపై బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి రోజారెడ్డిలతో పాటు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

కలువాయి తహసీల్దార్ బదిలీ

నెల్లూరు (దర్గామిట్ట) : కలువాయి తహసీల్దార్ పసుపులేటి సుబ్రహ్మణ్యంను కావలి ఆర్డీఓ కార్యాలయ డీఏఓగా నియమిస్తూ కలెక్టర్ ఎం.హరినారాయణన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అక్కడ డీఏఓగా పనిచేస్తున్న వెంకట సునీల్‌ను కలువాయి తహసీల్దార్‌గా నియమించారు.

ఏఎస్‌పేట దర్గాలో ఎమ్మెల్సీ ఇస్మాయిల్

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాను ఎమ్మెల్సీ ఎండీ ఇస్మాయిల్ గురువారం దర్శించుకున్నారు. గత ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఆయన తొలిసారి దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా దర్గా సిబ్బంది ఆయన్ను సాదరంగా ఆహ్వానించారు. వక్ఫ్‌బోర్డు సీఈఓ హుస్సేన్ దగ్గరుండి ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. అనంతరం ఎమ్మెల్సీ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఇలాంటి పవిత్ర పుణ్యక్షేత్రాన్ని సందర్శించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఆయన వెంట దర్గా సిబ్బంది ఉన్నారు.

ఎంపీ వేమిరెడ్డికి శేషవస్త్రాల అందజేత

బుచ్చిరెడ్డిపాళెం : రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు గురువారం నెల్లూరులోని ఎంపీ నివాసంలో కలిసి స్వామివారి శేషవస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కామాక్షితాయి ఆలయంలో మహాకుంభాభిషేక వేడుకలు విజయవంతంగా ముగిశాయన్నారు. ఈ వేడుకలకు ఉభయకర్తలుగా వ్యవహరించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించడంతో పాటు ప్రసాదాలను అందించినట్లు తెలిపారు.


వేమిరెడ్డికి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేస్తున్న ఆయన చైర్మన్

బుచ్చిలో కారు బీభత్సం

- ఓ కారు, బైక్, ట్రాక్టర్‌ను ఢీకొట్టిన వైనం
- ఇద్దరికి గాయాలు


తీవ్రంగా గాయపడిన శివప్రసాద్


ఘటనా స్థలంలో బైక్, కారు

బుచ్చిరెడ్డిపాళెం : బైక్‌ను ఢీకొన్న ఓ కారు అనంతరం అదుపుతప్పి మరో కారుతో పాటు ట్రాక్టర్‌ను ఢీకొని బీభత్సం సృష్టించింది. ఈ ఘటన మండలంలోని రేబాల పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యాల గురునాథం తన కారులో నెల్లూరు వెళ్తుండగా మండలంలోని రేబాల వద్ద పెట్రోల్ బంక్ నుంచి ఓ బైక్ రావడంతో దానిని ఢీకొన్నాడు. అనంతరం ముందు వెళ్తున్న మరో కారును వెనుకభాగాన ఢీకొన్నాడు. తర్వాత కారు పూర్తిగా కంట్రోల్ తప్పడంతో రాంగ్‌రూట్‌లోకి వచ్చి పెట్రోల్ బంక్ ముందు ఉన్న డోజర్ (ట్రాక్టర్)ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అదుపుతప్పిన కారుతో పాటు బైక్, మరో కారు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన శివప్రసాద్ అనే వ్యక్తి దాదాపు ఏడు అడుగులు ఎగిరి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని బుచ్చిరెడ్డిపాళెం సీహెచ్‌సీకి తరలించారు. అలాగే అదుపుతప్పిన కారులో ఉన్న గురునాథం కూడా స్వల్పంగా గాయపడ్డారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎస్సై వీరప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు బాలికలపై లైంగికదాడి

- ఆరేళ్ల చిన్నారిపై వికృత చేష్టలు
- నిందితులపై పోక్సో కేసు నమోదు

నెల్లూరు రూరల్ : కామంతో కళ్లుమూసుకుపోయిన ఇద్దరు వ్యక్తులు అభం శుభం తెలియని ఇద్దరు బాలికలపై లైంగికదాడికి పాల్పడ్డారు. మరో ఆరేళ్ల చిన్నారిపై వికృతచేష్టలకు దిగారు. దీంతో చిన్నారులు బెంబేలెత్తిపోవడంతో చుట్టుపక్కల వారి ద్వారా విషయం తెలుసుకున్న బాధిత కుటుంబసభ్యులు కామాంధులకు దేహశుద్ధి చేశారు. ఈ ఘటన రూరల్ మండలం పరిధిలోని వైఎస్సార్‌నగర్‌లో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు.. వైఎస్సార్‌నగర్‌లో ఓ మహిళ తన ఇద్దరి పిల్లలతో కలిసి జీవిస్తోంది. ఆమె కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివిస్తోంది. కాగా వైఎస్సార్ నగర్ పుట్టవీధిలో దస్తగిరి నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భర్త వేధింపులు తాళలేక భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి అతను ఒంటరిగా ఉంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన శేఖర్, దస్తగిరి స్నేహితులు. ఇద్దరూ కలిసి కొంతకాలంగా స్థానికంగా ఉన్న చిన్నారుల పట్ల అసభ్యంగా ప్రవర్తించసాగారు. ఈ నేపథ్యంలో గతనెల 30న వారు ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికతో పాటు, 11 ఏళ్లు, ఆరేళ్ల వయస్సు కలిగిన మరో ఇద్దరు బాలికలను నిర్బంధించి వికృత చేష్టలకు పాల్పడ్డారు. మూడు రోజుల క్రితం ఎనిమిదో తరగతి చదువుతున్న చిన్నారి ఒంటరిగా ఉండటాన్ని గమనించిన దస్తగిరి ఆమె ఇంట్లోకి వెళ్లి తినడానికి బిస్కెట్లు కొనిస్తానని ఆశచూపి మరోసారి లైంగికదాడి చేశాడు. ఈనెల 3వ తేదీన ఈ విషయాన్ని స్థానికంగా ఉన్న చిల్లర దుకాణం నిర్వాహకురాలు బాలిక తల్లికి తెలియజేయడంతో ఆమె కుమార్తెను ప్రశ్నించగా సదరు కామాంధుల వికృతచేష్టలు వెలుగులోకి వచ్చాయి. దీంతో బాధిత కుటుంబసభ్యులు సదరు వ్యక్తులకు దేహశుద్ధి చేశారు. ఈ మేరకు వారు గురువారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులపై పోక్సో కేసు నమోదు చేశారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

- రూ.11 లక్షల విలువైన వస్తువుల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రూరల్ డీఎస్పీ


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి

వెంకటాచలం : జల్సాలకు అలవాటు పడిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడ్డారు. రాత్రి వేళల్లో ఇళ్లలోకి ప్రవేశించి బంగారు నగలు, మోటారు బైక్‌లు చోరీలకు పాల్పడుతూ వచ్చారు. ఇదే క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతూ గురువారం ఉదయం పోలీసులకు చిక్కారు. వారిని విచారించి రూ.11 లక్షల విలువైన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఉదయం రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఇటీవల కాలంలో రాత్రి వేళల్లో ప్రజలు గాఢ నిద్రలో ఉన్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లల్లోకి ప్రవేశించి, బంగారు నగలు, టీవీలు, మోటార్ బైక్‌ల చోరీలకు పాల్పడుతున్నారు. ఈ చోరీల కేసు ఛేదనకు సంబంధించి వెంకటాచలం సీఐ గంగాధర్‌రావు ఆధ్వర్యంలో గత కొన్ని నెలల నుంచి ప్రత్యేక నిఘా పెట్టారు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో నెల్లూరు రూరల్ మండలం సుందరయ్య కాలనీ జంక్షన్ వద్ద ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో గమనించి వారిని అదుపులోకి తీసుకుని విచారించగా చోరీల ముఠా సభ్యులని తేలింది. నిందితులు నెల్లూరు రూరల్ మండలం కల్లూరుపల్లి గ్రామానికి చెందిన దువ్వూరు చంద్రశేఖర్, కొల్లపూడి నవీన్, షేక్.సుభాని, కురుగొండ మహేంద్ర, నెల్లూరు నగరం ఖుద్దూస్‌నగర్‌కు చెందిన షేక్.నూరుల్లాగా గుర్తించారు. నిందితులను విచారించగా వారిపై నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని ఐదు పోలీస్‌స్టేషన్లలో 17 కేసులు ఉన్నట్లు తేలింది. ఈ కేసులకు సంబంధించి నిందితుల వద్ద రూ.11 లక్షల విలువైన 12 సవర్ల బంగారు నగలు, 8 మోటారు బైక్‌లు, 5 టీవీలు స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు హాజరు పరిచారు. దొంగల ముఠాను పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ గంగాధర్‌రావు, ఐడీ పార్టీ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

